సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

వెలుగుల పండగకు వేళాయె..

- నేడు దీపావళి పర్వదినం
- జోరుగా బాణసంచా విక్రయాలు
- టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలంటున్న పోలీసులు



దీపావళి టపాసులు



ఆదర్శ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

పెదగంట్యాడ: ఇంటింటా ఆనందంగా జరుపుకునే దీపావళి పండగకు వేళాయింది. సోమవారం ఇంటిల్లిపాది ఆనందోత్సాహాల నడుమ పెద్ద, చిన్నా తారతమ్యం లేకుండా ప్రమిద దీపాలు వెలగించి.. టపాసులు కాల్చి దీపావళి జరిపేందుకు సిద్ధమయ్యారు. పెదగంట్యాడ, ఆదర్శ్ గ్రౌండ్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద మూడు రోజులుగా బాణసంచా సామగ్రి, ప్రమిదల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. దీపావళి పండగ ఒకప్పటి మాదిరిగా లేదు. ఎంత ఎక్కువ పొగ, శబ్దం వస్తే అంత బాగా దీపావళి చేసినట్టు అనే భావనలో నేటి యువత ఉన్నారు. బాణసంచా వెలుగుల మాటున ప్రమాదం కూడా పొంచి ఉంటుంది. కొద్దిపాటి నిర్లక్ష్యంతో వ్యవరించినా.. పండగ రోజు విషాదంగా మిగిలే అవకాశం ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. టపాసులతో సందడి చేస్తూ.. వెలుగుల పండగను ఆనందాల కేళిలా జరుపుకుందామని పిలుపునిస్తున్నారు.

పిల్లల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- టపాకాయలు పనితీరు, వెలిగించాల్సిన విధానంపై పిల్లలకు అర్థమయ్యేలా పెద్దలు చెప్పాలి.
- ఇంటి బయట మాత్రమే టపాసులు కాల్చాలి. టపాసులను చేతితో పట్టుకుని కాల్చరాదు.
- ఇళ్లలో ప్రమాదకర వస్తువులు, వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే చోట టపాసులు కాల్చకూడదు.
- టపాసులు కాల్చే సమయంలో కాటన్ దుస్తులు ధరించాలి.
- టపాసులు కాల్చే సమయంలో అనుకోని పరిస్థితుల్లో గాయపడితే సొంత వైద్యం కాకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- అందరూ అప్రమత్తంగా వ్యవరిస్తేనే ఆనంద దీపావళి అవుతుంది.

జాగ్రత్తలే రక్ష



పిల్లలు, పెద్దలు ఎంతో ఆనందంగా నిర్వహించే పండగ దీపావళి. టపాసులు కాల్చే సమయంలో ప్రజలు సరైన జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా ఇంటి బయట టపాసులు కాల్చాలి. ఇరుకు ప్రదేశాల్లో కాలిస్తే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంటుంది. పిల్లల విషయంలో తల్లిదండ్రులు మరిన్ని జాగ్రత్తలు పాటించాలి. టపాసుల విక్రయదారులు కూడా జాగ్రత్తలు పాటించాలని ఇప్పటికే ఆదేశాలిచ్చాం.

– కామేశ్వరరావు, సీఐ, న్యూపోర్ట్ పోలీస్ స్టేషన్

సందడిగా గాజువాక మార్కెట్లు

- జనంతో కళకళలాడుతున్న దీపావళి బాణసంచా దుకాణాలు



ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు



గాజువాకలో కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న బాణసంచా దుకాణాలు

గాజువాక: దీపావళి సంబరాలకు గాజువాక సిద్ధమైంది. ప్రమిదలు, పూజా సామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్‌లో సందడి ప్రారంభమైంది. ఇప్పటివరకు షీలానగర్ వద్ద ప్రారంభమైన బాణసంచా విక్రయాలు.. ఇప్పుడు గాజువాకలోని ఆదర్శ గ్రౌండ్ సహా అన్ని ప్రాంతాల్లోను మొదలయ్యాయి. బాణసంచా ధరలు పెరగడంతో జనం కొద్ది మొత్తంలో కొనుగోలు చేసుకుంటున్నారు.

72 బాణసంచా దుకాణాలు

గాజువాక ప్రాంతంలో 72 బాణసంచా విక్రయ కేంద్రాలను వ్యాపారులు ప్రారంభించారు. షీలానగర్, ఆదర్శ గ్రౌండ్, స్టీల్‌ప్లాంట్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో ఈ విక్రయాలు సాగుతున్నాయి. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ కో ఆపరేటివ్ స్టోర్స్‌లో మూడు రోజులుగా బాణాసంచా విక్రయాలు సాగుతున్నాయి. నగరంలో మిగిలిన అన్ని ప్రాంతాల కంటే ఈ స్టోర్స్‌లో తక్కువ ధరలకు లభిస్తాయనే విషయం తెలిసిందే.

దీపావళికి సిద్ధమైన జనం

అజ్ఞాన చీకట్లను పారదోలి తమ జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ ఈ పండగను ఘణంగా నిర్వహించేందుకు ప్రజలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అందులో భాగంగా దీపాలను కొట్టడానికి అవసరమైన చెరకు గెడలు, వివిధ మొక్కలకు సంబంధించిన పుల్లలను మార్కెట్‌లో విరివిగా విక్రయిస్తున్నారు. ప్రమిదలు, కొవ్వొత్తుల కొనుగోలుకు సైతం జనం క్యూ కట్టారు. ఈసారి దీపావళి సామగ్రి ధరలు నింగినంటాయని పలువురు కొనుగోలుదారులు పెదవి విరిచారు. దీంతో మొక్కుబడిగా కొనుగోలు చేయాల్సి వచ్చిందని వాపోయారు.



దుకాణాల్లో పండగ అలంకరణ సామగ్రి

క్లుప్తంగా

బ్రహ్మకుమారీ సంస్థలో ఘనంగా దీపావళి



క్రాకర్లు కాల్చుతున్న చింతలపూడి, బ్రహ్మకుమారీలు

గాజువాక: స్థానిక జగ్గు జంక్షన్‌లోని ప్రజాపిత బ్రహ్మకుమారీ సంస్థ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం శాఖలో ఆదివారం దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దీపావళి ప్రతి ఒక్కరిలోనూ జ్ఞాన కాంతులను వెలగించాలని ఆకాంక్షించారు. బ్రహ్మకుమారీ సంస్థ అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాజయోగినులు సోమేశ్వరి, మమత, విజయ, శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తిప్పల అప్పలస్వామికి సత్కారం



తిప్పల అప్పలస్వామిని శాలువాతో సత్కరిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ వింగ్ అధ్యక్షుడిగా నియమితుడైన తిప్పల అప్పలస్వామిని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అభినందించారు. ఈ మేరకు ఆదివారం ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ధర్మాల శ్రీను, తిప్పల గోపి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టానికి కృషి చేయాలి



ఉబ్బ రామును సత్కరిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి

అగనంపూడి: పార్టీ కోసం కష్టపడే వారిని అధినాయకత్వం గుర్తిస్తుందని, చిత్తశుద్ధితో పనిచేసి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. అగనంపూడికి చెందిన ఉబ్బరామును పార్టీ జిల్లా వలంటీర్ల విభాగం కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా ఆదివారం గాజువాకలోని దేవన్‌రెడ్డి కార్యాలయంలో అగనంపూడికి చెందిన నాయకులు కలిశారు. రామును దేవన్‌రెడ్డి సత్కరించి మాట్లాడారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి నక్కా రమణబాబు, వార్డు వలంటీర్ల విభాగం అధ్యక్షుడు మామిడి రాము, నాయకులు రమణారెడ్డి, భాస్కరరావు, రాజబాబు, అప్పలస్వామి పాల్గొన్నారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన సేవ విశేషంగా నిర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తరపూజ జరిపారు. ఉభయదాతలకు శేష వస్త్రాలు, ప్రసాదం అందించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది.

మరింత బలోపేతంగా కోటి సంతకాల ఉద్యమం



సంతకాల సేకరణ సభలో మాట్లాడుతున్న తైనాల విజయకుమార్



ప్రజల నుంచి సంతకాలు సేకరిస్తున్న దేవన్‌రెడ్డి

కూర్మన్నపాలెం: వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజలను అప్రమత్తం చేసి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్ పిలుపునిచ్చారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆదివారం 87వ వార్డులో నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటుపరం పేరుతో తమకు కావాల్సిన వారికి ధారాదత్తం చేస్తోందని ఆరోపించారు. ఇటువంటి పోకడలు అరికట్టాలంటే ఉద్యమం మరింత బలంగా చేపట్టాల్సి ఉందన్నారు. ప్రజలకు ప్రభుత్వ తీరును వివరించి వారిని ఉద్యమానికి సిద్ధం చేయాలని సూచించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు తీసుకొచ్చారని, వాటిని ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం అన్యాయమన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రజలు ముక్త కంఠంతో వ్యతిరేకించాలని కోరారు. లేకుంటే విద్యార్థులు అన్యాయమైపోతారన్నారు. ఈ అంశాన్ని ప్రజలకు వివరించి ఉద్యమాన్ని బలోపేతం చేయాడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు బొడ్డు గోవింద్, దామోదర్, వెంకటరమణ తదితరులు మాట్లాడారు. దుగ్గపు దానప్పలు ప్రగడ శ్రీనివాసరావు, గోవిందరాజులు, సన్యాసిరావు రమణమ్మ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వార్డుల్లోని వివిధ వర్గాల ప్రజల నుంచి సంతకాలు సేకరించారు.

జీవిత బీమాకు ఎంఈఎం నివేదిక మెలిక

అగనంపూడి: బీమా సొమ్ము చెల్లించడానికి ప్రమాదవశాత్తు మరణించినట్టు మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్(ఎంఈఎం) నివేదిక అవసరమని ముడిపెట్టడం, వాటిని అందివ్వాల్సిన పోలీసులు కప్పదాటుగా వ్యవహరిస్తుండడం సరికాదని బాధితురాలు సీతిన లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త ఉక్కు కర్మాగారంలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతిచెందారని, బీమా సంస్థకు మండల మేజిస్ట్రేట్ నివేదికను పోలీసులు ఇవ్వాల్సి ఉండగా.. ఎఫ్ఐఆర్‌నే నివేదకగా ఏసీపీ కార్యాలయం అందించిందన్నారు. దీంతో తాను ఆర్థికంగా నష్టపోతున్నానని, నగర పోలీస్ కమిషనర్ స్పందించి తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

ఆగిన లారీని ఢీకొన్న మరో లారీ



రెండు లారీల మధ్య ఇరుక్కుపోయిన డ్రైవర్ రవిచరణ్

సబ్బవరం: మండలంలోని అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై ఆగివున్న లారీని వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై స్థానిక ఎస్ఐ సింహాచలం తెలిపిన వివరాలు.. హైవేపై చిన్నయ్యపాలెం వద్ద సర్వీస్ రోడ్డులోని టీ స్టాల్ ముందు ఆదివారం ఉదయం ఓ లారీ డ్రైవర్ తన లారీని నిలిపాడు. పెందుర్తి నుంచి సబ్బవరం వైపు వస్తున్న మరో లారీ ఆగివున్న ఈ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ఆ లారీ డ్రైవర్ వెంపల రవిచరణ్(25) రెండు కాళ్లు ఇరుక్కుపోయి, తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో పాటు సబ్బవరం పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. 108 సిబ్బంది డాక్టర్ల సూచన మేరకు ఇరుక్కున్న లారీ క్యాబిన్లోనే రవిచరణ్‌కు సెలైన్ బాటిల్ ఎక్కించి, అత్యవసర వైద్య సేవలు అందించారు. రెండున్నర గంటల పాటు శ్రమించి డ్రైవర్‌ను బయటకు తీసి, చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన డ్రైవర్ మూడు రోజులుగా వాహనాన్ని నడుపుతున్న నేపథ్యంలో నిద్రమత్తులో ఈ ఘటన జరిగిందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. డ్రైవర్ రవి గాజువాక దరి జగ్గు జంక్షన్‌కు చెందినవాడిగా తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సింహాచలం తెలిపారు.

మట్టి ప్రమిదల పంపిణీ



ప్రమిదలు అందజేస్తున్న సీఐ పార్థసారథి

గాజువాక: గాజువాక పోలీస్ స్టేషన్‌లో సిబ్బందికి ఆదివారం బీజేపీ నాయకులు మట్టి ప్రమిదలు పంపిణీ చేశారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రమిదలను గాజువాక సీఐ పార్థసారధి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కట్టా పద్మ, యువశ్రీ, పావని, శంకరరావు, బాటా శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉద్యోగికి సన్మానం



కరణం కళావతిని సత్కరిస్తున్న అన్నపూర్ణనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: అగనంపూడి ఆస్పత్రిలోని ఐసీటీసీ ల్యాబ్‌లో పనిచేసి కేజీహెచ్‌కు బదిలీపై వెళ్లిన కరణం కళావతిని 79వ వార్డు అగనంపూడిలోని అన్నపూర్ణానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కాలనీలోని పూర్ణ గణపతి ఆలయంలో ఆదివారం ఆమెకు సత్కారం చేశారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు దానబాల చిన సన్యాసిరావు, ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి దేముడు మాట్లాడుతూ రెండు దశాబ్దాల పాటు సుదీర్ఘ సేవలు అందించి స్థానికులకు సుపరిచితురాలుగా మారిన కళావతి సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ అగనంపూడి ఇన్‌చార్జి బీకే రామకోటి అన్నయ్య, ఉక్కు కార్మిక సంఘం నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, లయన్స్ క్లబ్ విశాఖ జిల్లా చైర్‌పర్సన్ కిడిమి హనుమంతురావు, వివిధ సంస్థల ప్రతినిధులు బి.శ్రీనివాసరావు, కె.జోగినాయుడు, ఎం.చిట్టమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ స్కూళ్ల సమస్యలపై వినతి



అప్సా ప్రతినిధులకు వినతిపత్రం అందజేస్తున్న జిప్సా ప్రతినిధులు

గాజువాక: బడ్జెట్ స్కూళ్లు ఎదుర్కొంటున్న సమస్యలపై గాజువాక ఇండస్ట్రియల్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్(జిప్సా) ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్(అప్సా) ప్రతినిధులకు వినతి పత్రం అందజేశారు. అప్సా నిర్వహిస్తున్న హలో మిత్రమా ఎలా ఉన్నారు.. కార్యక్రమం ఆదివారం గాజువాక ప్రాంతానికి చేరుకుంది. ఈ సందర్భంగా అప్సా ప్రతినిధులకు స్వాగతం పలికిన జిప్సా ప్రతినిధులు పాఠశాలల నిర్వహణలో ప్రభుత్వ నిబంధనల వల్ల తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు వివిధ పాఠశాలలను సందర్శించారు. కార్యక్రమంలో జిప్సా నాయకులు పి.భాస్కరరావు, రామకృష్ణ, బి.శ్రీనివాసరావు, ఎస్.షణ్ముఖరావు, ఎం.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలు సత్వరం కేటాయించండి



మంగళపాలెం టిడ్కో గృహ సముదాయం వద్ద నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

అగనంపూడి: టిడ్కో ఇళ్ల కోసం డబ్బులు చెల్లించి దశాబ్దం కాలం గడుస్తోందని, కాలనీలో సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించి వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ కోరారు. 88వ వార్డు మంగళపాలెం టిడ్కో గృహ సముదాయం వద్ద ఆదివారం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు పదేళ్ల కిందట ఇళ్లు లేని నిరుపేదల నుంచి డబ్బులు డిపాటివ్ మొత్తాన్ని సేకరించారని, అప్పట్లోనే ప్లాట్లు కేటాయిస్తామని నమ్మబలికించారని, నేటికీ కేటాయించకపోవడం వల్ల గృహ సముదాయం శిథిలావస్థకు చేరుకునే పరిస్థితి వస్తోందన్నారు. కనీస వసతులు సత్వరం కల్పించి లబ్ధిదారులకు అప్పగించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టిడ్కో గృహ లబ్ధిదారుల సంఘ నాయకులు రొక్కం శ్రీనివాసరావు, ఎ.గోపి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆనంద్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన అధ్యక్షుడు రామస్వామి



ప్రధాన కార్యదర్శి అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. ఉక్కునగరం గురజాడ కళాక్షేత్రంలో జరిగిన మహాసభలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఇప్పటి వరకు యూనియన్ గౌరవాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన జె.అయోధ్యరామ్‌ను యూనియన్ నూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన యు.రామస్వామి నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.జగ్గునాయుడు యూనియన్ గౌరవాధ్యక్షుడిగా ఎన్నికైనట్టు ప్రకటించారు.

ఏయూలో ప్రకృతి పంటల సంత విజయవంతం

మద్దిలపాలెం: ఏయూలోని 'ఆ హబ్'ప్రాంగణంలో భారత్ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రకృతి ఆధారిత పంటల సంత విజయవంతమైంది. ఈ సందర్భంగా భారత్ కిసాన్ సంఘ్ కేంద్ర కమిటీ సభ్యుడు జలగం కుమారస్వామి మాట్లాడుతూ ఈ సంతకు విశేష స్పందన లభించిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనం కోసం ప్రకృతి ఆధారిత పంటలనే ఆహారంగా తీసుకోవాలని కోరారు. ఈ ప్రకృతి ఆధారిత పంటల సంత ఇకపై ప్రతి ఆదివారం ఇదే వేదికపై క్రమం తప్పకుండా జరుగుతుందని వెల్లడించారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వారాహి ఎఫ్‌పీవో సహకారంతో ఈ పంటలను నేరుగా వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ హబ్ సంస్థ ప్రతినిధి ఈశ్వరపు రవి, గో ఆధారిత ప్రకృతి పంటల రైతు సంఘం ప్రతినిధులు పి.ఎల్.ఎన్. రాజు, దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, పాలెం నేచురల్స్ అశోక్, రిషి, వారాహి సంస్థ ప్రతినిధి గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి పంటల సంతలో భారత్ కిసాన్ సంఘ్ కేంద్ర కమిటీ సభ్యుడు జలగం కుమారస్వామి, కేంద్ర కమిటీ సభ్యులు

ఘనంగా జర్నలిస్టుల దీపావళి సంబరాలు



జర్నలిస్టులకు దీపావళి కానుకలు అందిస్తున్న సీఐలు కామేశ్వరరావు, పార్థసారథి తదితరులు

పెదగంట్యాడ: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బీసీ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న గాజువాక పోలీస్ స్టేషన్ సీఐ పార్థసారథి, న్యూపోర్టు పోలీస్ స్టేషన్ సీఐ కామేశ్వరరావు చేతుల మీదుగా జర్నలిస్టులకు దీపావళి కానుకలు పంపిణీ చేశారు. ఏపీయూడబ్ల్యూజె గాజువాక అధ్యక్షుడు పరశురామ్, కార్యదర్శి లీలా ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు వర్మ, జిల్లా అధ్యక్షుడు కె.రాము, రామచంద్రావు తదితరులు పాల్గొన్నారు.